సాక్షి
జనగామ

ఆదివారం । 10 । నవంబర్ । 2024



ఫొటోగ్రాఫర్లకు ఉపాధి గండం

ప్రస్తుత కాలంలో స్మార్ట్‌ఫోన్లతో ఫొటో గ్రాఫర్ల జీవనోపాధి దెబ్బతింటోంది. వినియోగదారుల ఆదరణ లేక చాలా చోట్ల స్టూడియోలను ఎత్తివేస్తున్నారు. - 8లో▸



తెలంగాణకే తలమానికం..

ఒగ్గు కథ పితామహుడు చుక్కా సత్తయ్య తెలంగాణ రాష్ట్రానికే తలమానికమని టీజీకేడీ వ్యవస్థాపక అధ్యక్షుడు పృథ్వీ అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$30^0/19^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం మంచు కురుస్తుంది. మధ్యాహ్నం ఎండ మామూలుగా ఉంటుంది. రాత్రి చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

వైభవంగా వారకల్యాణం



చిల్పూరు: బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని శనివారం భక్తుల సమక్షంలో గోవింద నామస్మరణ మధ్య అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ వైభవంగా వార కల్యాణం నిర్వహించారు. భక్తులకు చెరుకు చైతన్య, శ్రావ్య, అంచూరు హణుమంత రావు, గీత దంపతులు అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ ఈఓ భాగం లక్ష్మిప్రసన్న, ఆలయ మాజీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, కిరణ్మయి, సంగోజు మోహనాచారి, శంకరలక్ష్మి పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



జనగామ రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-14 రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో జి.గౌతమ్ అనే విద్యార్థి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై నట్లు టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ పాఠశాల నుంచి 14, 16, 19 విభాగంలో 11 మంది విద్యార్థులు పాల్గొనడం జరిగిందని తెలిపారు. అందులో 14 సంవత్సరాల విభాగం నుంచి జి.గౌతమ్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా గౌతమ్‌ను పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, పీడీ కిషన్, వేణు, వైస్ ప్రిన్సిపాల్ నర్సింహులుగౌడ్, వేణు మాదవ్ అభినందించారు.

రేపటి గ్రీవెన్స్ రద్దు

జనగామ: సమగ్ర కుటుంబ కుల సర్వే నేపథ్యంలో ఈ నెల 11వ తేదీ (సోమవారం) కలెక్టరేట్‌లో జరిగే గ్రీవెన్స్‌ను రద్దు చేసినట్లు కలెక్టర్ రిజ్వాన్ బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి వినతులు ఇచ్చేందుకు కలెక్టరేట్‌కు రావొద్దని సూచించారు.

శ్రీను కుటుంబానికి రూ.3లక్షల చెక్కు



పాలకుర్తి టౌన్: గత నెల పాలకుర్తి పోలీస్‌స్టేషన్‌లో పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకున్న లకావత్ శ్రీను కుటుంబానికి మాజీ సీఎం కేసీఆర్ ఎర్రవెల్లి ఫామ్ హౌస్‌లో శనివారం రూ.3లక్షల చెక్కు అందించారు. శ్రీను కుటుంబానికి న్యాయం జరిగే వరకు బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని కేసీఆర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కేయూ లైబ్రరీ మెంబర్ ఇన్‌చార్జ్‌గా ప్రొఫెసర్ శ్రీలత



కేయూ క్యాంపస్: కేయూ లైబ్రరీ మెంబర్ ఇన్‌చార్జ్‌గా ఫిజిక్స్ విభాగాచార్యులు సీజే శ్రీలత నియమితులయ్యారు. ఈమేరకు రిజిస్ట్రార్ మల్లారెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు జువాలజీ విభాగం ప్రొఫెసర్ ఆచార్యులు జి.షమిత కేయూ లైబ్రరీ మెంబర్ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఆమె స్థానంలో సీజే శ్రీలతను నియమించారు. సీజే శ్రీలత ఫిజిక్స్ విభాగాధిపతిగాను, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గానూ, కేయూ అడ్మిషన్ల జాయింట్ డైరెక్టర్‌గా కూడా బాధ్యతలు నిర్వర్తించారు. లైబ్రరీ మెంబర్ ఇన్‌చార్జ్‌గా ఏప్రిల్ 30వరకు కొనసాగనున్నారు. ఒకటి రెండ్రోజుల్లో శ్రీలత బాధ్యతలు స్వీకరించనున్నారు.

నవోదయ దరఖాస్తుల గడువు పొడిగింపు

మామునూరు: వరంగల్ మామునూరు జవహర్ నవోదయ విద్యాలయ సమితిలో 2025-2026 విద్యా సంవత్సరానికి తొమ్మిది, పదకొండో తరగతిలో ఏర్పడిన ఖాళీల ప్రవేశాల కోసం ఈనెల 19 వరకు ప్రవేశాల కోసం దరఖాస్తుల స్వీకరణ గడువు పెంచినట్లు ప్రిన్సిపాల్ బి.పూర్ణిమ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న 9, 11 తరగతుల్లో ఏర్పడిన ఖాళీలను భర్తీ చేసేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆమె తెలిపారు.

తొలిరోజు
9,284
కుటుంబాల సర్వే

జిల్లాలో శనివారం మొదటి రోజు 9,284 కుటుంబాల సమగ్ర సర్వే పూర్తి చేశారు. 12 మండలాల పరిధిలో 8,272, మున్సిపల్ పరిధిలోని 30 వార్డుల్లో 1,012 కుటుంబాల సర్వే పూర్తయినట్లు అధికారులు వెల్లడించారు. కాగా జిల్లాలో 1,62,512 గృహాలు ఉన్నాయి.

బచ్చన్నపేటలో సర్వే చేస్తున్న ఎన్యుమరేటర్ బొడిగం వనజ



గంటకు ఒక కుటుంబం

జిల్లాలో ప్రారంభమైన సమగ్ర కుటుంబ సర్వే

- అధిక ప్రశ్నలు, 243 ఉప కులాల కోడింగ్ నంబర్లు ఉండటంతోనే ఎక్కువ సమయం
- ఎన్యుమరేటర్లకు ఎదురు ప్రశ్నలు వేస్తున్న ప్రజలు
- ధరణి, ఆదాయం, ఐటీ, ఇంటి గజాల లెక్కలో క్లారిటీ లేదు
- సర్వేకు వెళితే కొన్ని ఇళ్లకు తాళం..
- పూర్తి కావాలంటే నెలపైనే..!

జనగామ: ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర సర్వే శనివారం జిల్లాలో ప్రారంభమైంది. కలెక్టర్ రిజ్వాన్ బాషా పర్యవేక్షణలో అదనపు కలెక్టర్లు పింకేష్‌కుమార్, రోహిత్‌సింగ్, ఆర్డీఓలు, ఇతర జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు సర్వే ప్రారంభమైంది. ఒక్కో ఎన్యుమరేటర్‌కు 150 నుంచి 175 ఇళ్లను కేటాయించారు. అయితే 56 ప్రశ్నలు.. 19 సబ్ ప్రశ్నలు... 243 కోడింగ్ నంబర్లతో ఇంటింట సర్వే చేస్తుండటంతో గంటకు ఒక కుటుంబం మాత్రమే అవుతుందని ఎన్యుమరేటర్లు వాపోతున్నారు. పైగా సర్వే సమయంలో అనేక మంది ఎదురు ప్రశ్నలు వేస్తుండటంతో అధికారులకు తలనొప్పిగా మారింది.

వ్యక్తిగత సమాచారం ఇచ్చేందుకు నిరాకరణ..

సర్వే సమయంలో మొదట వ్యక్తిగత సమాచారం ఇచ్చేందుకు నిరాకరిస్తున్నప్పటికీ, అధికారులు నచ్చ చెబుతున్నారు. విద్య విషయంలో చదువు ఎందుకు మానేశారనే వివరాలు చెప్పలేక పోతున్నారు. ధరణి, ఆదాయం, ఐటీ, కులాంతర వివాహాలు, పట్టాదార్ పుస్తకం నంబర్, రియల్ ఎస్టేట్, పారిశ్రామిక రంగాలు, వడ్డీ వ్యాపారస్తులు, వార్షిక ఆదాయం, ఇంటి గజాల లెక్కలో క్లారిటీ లేకుండా పోయింది. ప్రజాపాలన సమయంలో చేసుకున్న దరఖాస్తులకు మోక్షం లేదని.. మళ్లీ సర్వే ఎందుకంటూ చాలా చోట్ల ఎదురు ప్రశ్నలు వేయడంలో ఎన్యుమరేటర్లు సమాధానం చెప్పలేక పోయారు.

ఫుల్ డే కావాలి..

రెండో శని, ఆదివారం కావడంతో ప్రభుత్వ ఉపాధ్యాయులకు రోజంతా సర్వే చేసే అవకాశం వచ్చినా.. 10 కుటుంబాల సర్వే పూర్తయ్యే వరకు సాయంత్రం 5 దాటింది. ఈ నెల11వ (సోమవారం) తేదీ నుంచి ఉదయం పాఠశాలకు వెళ్లి మధ్యాహ్నం నుంచి సర్వే చేయాల్సి ఉంటుంది. 12.15 గంటలకు భోజన విరామం తర్వాత, టీచర్లు ఇంటికి వచ్చి సర్వేకు సిద్ధం కావాలంటే మధ్యాహ్నం 2 దాటి పోతుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉపాధ్యాయులు 2 గంటలకు కుటుంబం వద్దకు వెళ్లి ఫొటో తీసి అధికారి వాట్సాప్‌కు పంపించాల్సి ఉంటుంది. రోజంతా పని చేసినా పది కుటుంబాలు పూర్తయ్యే పరిస్థితి లేకపోవడంతో ఫుల్ డే అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. ఇదిలా ఉంటే రోజువారి కూలీలు, ప్రైవేట్ ఉద్యోగులు, పేద, మధ్య తరగతి కుటుంబాలు చాలా మంది మొదటి రోజు పనులు వదులుకుని ఇంటి వద్దనే ఉన్నారు. ఒక్కో కుటుంబం వద్ద సర్వే గంటకు పైగా పడుతుండడం, మిగతా వారికి అవకాశం రాకుండా పోయింది. సర్వే వందశాతం పూర్తి కావాలంటే నెలరోజులకు పైగా పడుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కలెక్టర్ పర్యవేక్షణ



జనగామ పట్టణంలో సర్వే తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ పట్టణంలోని రెడ్డిస్ట్రీట్, గణేష్ స్ట్రీట్, 18వ, 6వ వార్డులో ఆర్డీఓ గోపిరామ్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లతో కలిసి కలెక్టర్ రిజ్వాన్ బాషా పర్యటించి సర్వే సరళిని పరిశీలించారు. స్టేషన్‌ఘనపూర్ మోడల్ కాలనీలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి, రెవెన్యూ విభాగం అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, డీపీఓ స్వరూప, బచ్చన్నపేటలో డీఏఓ రామారావు, కొడకండ్లలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుశీల సర్వే తీరును పరిశీలించారు. అలాగే పాలకుర్తి, లింగాలఘణపురం మండలాల్లో కూడా సర్వే ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు.

మొదటి రోజు విజయవంతం



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర సర్వే జిల్లాలో విజయవంతంగా కొనసాగుతుంది. సర్వే సమయంలో కోడ్ ప్రశ్నలకు తప్పనిసరిగా సమాధానం రాయాలి. సమాచారం ఎట్టి పరిస్థితుల్లోనూ బయటకు రాదు. సర్వే ఫారంలో ఉన్న ప్రతీ ప్రశ్నను అర్థం చేసుకుని, కోడింగ్ బుక్కును పరిశీలించి సరైన సమాధానాలతో పూర్తి చేయాలి. ఎన్యుమరేటర్లు చేస్తున్న సర్వే ప్రక్రియను సూపర్‌వైజర్లు, స్పెషల్ ఆఫీసర్లు, ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి.

- రిజ్వాన్ బాషా, కలెక్టర్

సర్వేతో కుటుంబ పూర్తి సమాచారం..



కుటుంబ సర్వేలో నీ ఇష్టం అంటూనే పూర్తి సమాచారాన్ని సేకరిస్తున్నారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు, భూమి పట్టాదారు పాస్ పుస్తకాల వివరాలతో ప్రభుత్వం ఎక్కడ ఆస్తులున్నాయో తెలుసుకునేలా సర్వే చేస్తున్నారు. దీంతో ప్రభుత్వం సంక్షేమ పథకాలు ఇచ్చేటట్టు ఉంది.

- బుర్ర కిష్టయ్య, దేవరుప్పుల

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

- వీసీలో ఉప ముఖ్యమంత్రి భట్టి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్లు, అధికారులు

జనగామ: సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి సీఎస్ శాంతికుమారి, ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాతో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. కలెక్టర్లు ఎన్యుమరేటర్ల సర్వే తీరుతెన్నులను నిరంతర పర్యవేక్షించాలన్నారు. సర్వేకు మంత్రులు, ఎమ్మెల్యేలను ఆహ్వానించాలని, ప్రజల సందేహాలను నివృత్తి చేయాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ మొదటి రోజు అందరి సహకారంతో విజయవంతంగా పూర్తి చేసినట్లు కలెక్టర్ ఉప ముఖ్యమంత్రికి వివరించారు. వీసీలో కలెక్టరేట్ రిజ్వాన్‌బాషా, అదనపు కలెక్టర్లు పింకేష్ కుమార్, రోహిత్ సింగ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు, ఆర్డీఓ, అధికారులు పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేయాలి



ఘన్‌పూర్‌లో సర్వేను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ రోహిత్‌సింగ్

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇంటింటి కులగణన సమగ్ర సర్వేను పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్ రిజ్వాన్‌బాషా అన్నారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలోని మోడల్ కాలనీతో పాటు మండలంలోని విశ్వనాథపురం గ్రామంలో చేపడుతున్న సర్వేను కలెక్టర్ శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ప్రజలు ఎలాంటి సందేహాలు గురికావాల్సిన అవసరం లేదని, సర్వేలో అందించే వివరాలను గోప్యంగా ఉంచుతారన్నారు.

ఘన్‌పూర్‌లో అదనపు కలెక్టర్ పరిశీలన

ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలో చేపట్టిన సర్వేను అడిషనల్ కలెక్టర్ రోహిత్‌సింగ్, డీపీఓ స్వరూపరాణి పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే చేపడుతున్న సిబ్బందితో మాట్లాడి తగిన సలహాలు, సూచనలు అందించారు. ఎన్యుమరేటర్లు జాగ్రత్తగా సర్వే చేపట్టాలని, అందరూ బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, కార్యదర్శులు లింగయ్య, శ్రీకాంత్, సత్యనారాయణ, శారద తదితరులు పాల్గొన్నారు.

సమన్యాయం కోసమే సర్వే

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేతో ప్రజలందరికీ సమన్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో శనివారం జరిగిన ఇంటింట సమగ్ర సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే చేస్తున్న ఎన్యుమరేటర్లతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రధానంగా రెండు లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని సర్వే చేయిస్తుందన్నారు. రాజ్యాంగం ప్రతిపాదించిన రాయితీలు, రిజర్వేషన్లు, సబ్సిడీలు పొందని కుటుంబాలకు, ఇంతవరకూ అభివృద్ధి సంక్షేమ పథకాలకు దూరంగా ఉన్న పేద కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కులగణనతో రాష్ట్రంలో ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనార్టీలు, ఓసీలు ఎంతమంది ఉన్నారనేది తెలుస్తుందని, తద్వారా ఆయా వర్గాలకు రిజర్వేషన్లు అమలు చేయడం జరుగుతుందన్నారు. కొందరు ప్రతిపక్ష పార్టీల నాయకులు ఉద్దేశ్యపూర్వకంగా సర్వేపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో డీపీఓ స్వరూపరాణి, ఎంపీడీఓ విజయశ్రీ, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, కార్యదర్శి లింగయ్య, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం త్వరగా కొనుగోలు చేయాలి



ఈరవెన్నులోని కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన సరస్వతీ

పాలకుర్తి: రైతుల ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని జిల్లా సివిల్ సప్లయిస్ ఆఫీసర్ సరస్వతీ అన్నారు. శనివారం మండలంలోని ఈరవెన్ను గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ధాన్యం కాంటా, రవాణా, ఆన్‌లైన్ తదితర విషయాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సెక్రటరీ రణదీర్, రైతులు తదితరులు ఉన్నారు.

పేదలకు ఉచిత న్యాయ సేవలు

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి రవీంద్ర శర్మ



ర్యాలీలో న్యాయమూర్తులు, డీసీపీ, తదితరులు

జనగామ రూరల్: లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో పేదలకు ఉచితంగా న్యాయ సేవలు అందించేందుకు తమ తరపున న్యాయవాదిని కేటాయించడం జరుగుతుందని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి.రవీంద్ర శర్మ అన్నారు. శనివారం నేషనల్ లీగల్ సర్వీస్ డేను పురస్కరించుకుని సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్ డీసీపీ రాజమహేంద్రనాయక్, ఏసీపీ పార్థసారధి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎలగందుల చంద్రశేఖర్‌తో కలిసి కోర్టు నుంచి న్యాయమూర్తి సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. జిల్లా కోర్టు నుంచి రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్, ఆర్టీసీ చౌరస్తాకు ర్యాలీగా చేరుకుని తిరిగి కోర్టు ఆవరణకు చేరుకున్నారు. అనంతరం రవీంద్రశర్మ మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో ఉచితంగా కేసులు పరిష్కారం అవుతాయన్నారు. రూ.3 లక్షల కంటే తక్కువ ఆదాయం ఉన్న ఎస్సీ, ఎస్టీలు, మహిళలకు ఉచితంగా న్యాయవాదిని కేటాయించడంతో పాటు జాతీయ లీగల్ సర్వీస్ అథారిటీ రూపొందించిన స్కీంలను అమలు చేస్తామన్నారు.

సోమేశ్వర ఆలయంలో కార్తీక దీపోత్సవం



ఆలయ ఆవరణలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

పాలకుర్తి టౌన్: సోమేశ్వర లక్ష్మీనర్సింహ స్వామి ఆలయంలో కార్తీక మాస ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి కార్తీక దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దీపోత్సవంలో పాల్గొన్న మహిళలకు దేవస్థానం ఆధ్వర్యంలో తాంబూలం, ప్రసాదం వాయినంగా అర్చకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ సల్వాది మోహన్‌బాబు, సూపరింటెండెంట్ కొత్తపల్లి వెంకటయ్య, అర్చకులు డీవీఆర్‌శర్మ, అనిల్‌కుమార్, మత్తగజం నాగరాజు, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

టెక్నోఫెస్ట్.. అదరహో..



- రెండో రోజు అబ్బురపరిచిన టెక్నోజియాన్-24 ఈవెంట్లు
- ఉత్తేజాన్నిచ్చిన మాజీ ఐఏఎస్ డాక్టర్ తనుజైన్ ప్రసంగం
- నేటితో వేడుక ముగింపు

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లో టెక్నోజియాన్-24 మూడు రోజుల వేడుకల్లో భాగంగా శనివారం రెండవ రోజు జరిగిన కార్యక్రమాలు అలరించాయి. మొదట మాజీ ఐఏఎస్ అధికారి డాక్టర్ తనుజైన్ అంబేద్కర్ లర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో చిట్‌చాట్ చేశారు. మ్యాథ్స్‌కేర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ గజేంద్రపురోహిత్ గెస్ట్ లెక్చర్ ఆకట్టుకుంది. మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, మెకానికల్, కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈవెంట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు రూపొందించిన ఫీల్ ది పెయిన్, ఫోరెన్సిక్ ఇన్వెస్టిగేషన్, ఫ్యూచర్ మేనేజర్, సీకాడ క్విజ్, డబ్ యాక్షన్, డ్రోన్ వెలాసిటీ, బిల్డ్ ఏ పంచ్, కెమ్ రిలే, మెకానికల్ విభాగంలో వెహికల్ షో, వరంగల్ రోబోటిక్స్ సంస్థ ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



ప్రదర్శనలు వీక్షిస్తున్న విద్యార్థులు

నేటితో ముగింపు

సాంకేతిక మహోత్సవాలు ఆదివారం మూడో రోజు ముగియనున్నాయి. చివరి రోజు ఎస్కేప్ రూమ్, ఆస్ట్రో వరల్డ్, క్యాంపస్ ఇన్నోవేటిస్ ఈవెంట్లు జరగనున్నాయి.

మరిన్ని సాంకేతిక ప్రదర్శనలు - 8లో

బాయ్స్.. ఫీల్ ద పీరియడ్స్ పెయిన్..

మహిళలకు ప్రతినెలా పీరియడ్స్ సమయంలో ఎదురయ్యే కడుపునొప్పిని మగవారికి తెలియాలనే ఆలోచనతో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థినులు సిమ్యులేటర్‌ను రూపొందించారు. టెక్నోజియాన్‌లో భాగంగా వారు రూపొందించిన టెక్నాలజీని పలువురు బాయ్స్‌పై ప్రదర్శించారు.



ఫోరెన్సిక్‌తో కేసును పట్టు...

వివిధ రకాల కేసుల్లో కీలకపాత్ర పోషించే ఫోరెన్సిక్ ఇన్వెస్టిగేషన్ పరీక్షలను డీఎన్‌ఏ వేలిముద్రలతో తెలిపేలా కెమిస్ట్రీ ఇంజనీరింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ఎగ్జిబిట్ రూపొందించారు. వేలిముద్రతో దొంగలను దొరకపట్టు.. కేసును చేత పట్టు అంటూ చూపారు.

ఆకాశమే హద్దుగా డ్రోన్ షో



ఆకాశమే హద్దుగా పైకి ఎగురతానంటూ డ్రోన్ షో నిర్వహించారు. నిట్ రోబోటిక్స్ క్లబ్ రూపొందించిన డ్రోన్స్ రాబోయేతరంలో దేశరక్షణకు, వైద్య రంగంలో ఉపయోగపడే అవకాశం ఉంది. రాత్రి వేళలోనూ డ్రోన్ వేగాన్ని పసిగట్టేందుకు, వాటిని గుర్తించేందుకు అమర్చిన లేజర్ లైట్స్ వెలుగులు విరజిమ్మాయి.

వెహికిల్ షో అదుర్స్..



నిట్ వరంగల్‌లోని మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం విద్యార్థులు మెక్‌ఎక్స్ బృందం పేరిట మెక్ హోలిస్టర్ రూపొందించిన రేస్ కార్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కొండలు గుట్టల్లో, ఎత్తయిన ప్రదేశాలపైకి సునాయాసంగా రేస్‌కార్ మాదిరిగా దూసుకెళ్తుందని తెలిపారు.

నదులను శుభ్రం చేసేద్దాం



నదులను దర్శించుకున్నంత వరకు ఒకే కాని వాటిలో చెత్తాచెదారం, ప్లాస్టిక్ వస్తువులను పడేసి అపరిశుభ్రంగా మారుస్తున్న మానవులకు తమ బాధ్యతను తెలిపేందుకు క్లీనింగ్ దబోట్‌ను వరంగల్‌కు చెందిన మన్విత రూపొందించింది. రోబోటిక్ టెక్నాలజీతో కిలోమీటర్ దూరం నుంచి ఆపరేట్ చేస్తూ నదులను క్లీనింగ్ చేసే టెక్నాలజీని ప్రదర్శించి ఆకట్టుకున్నారు.

నిట్‌లో సాంకేతిక సందడి..



నేనే ఫ్యూచర్ మేనేజర్..

ఇండస్ట్రీ ఏదైనా నేనే ఫ్యూచర్‌మేనేజర్ అంటూ మేనేజ్‌మెంట్ స్టడీస్ సొసైటీ ఏర్పాటు చేసిన ఈవెంట్ అబ్బురపరిచింది. వంద మంది ఒకే వేదికపై పాల్గొని ప్రదర్శన ఇవ్వగా సత్తా చాటి నేను ఫ్యూచర్‌మేనేజర్ అంటూ నైపుణ్యాన్ని ప్రదర్శించి ఆకట్టుకున్నారు. టెక్నోజియాన్ వేదికగా రాబోవు రోజుల్లో పారిశ్రామిక రంగంలోనూ రాణిస్తామంటూ అదరగొట్టారు.



కాయిన్ వెయ్యి.. చాక్లెట్ పట్టు

చెయ్యి చాపు.. కాయిన్ వేయ్.. చాక్లెట్ పట్టు అంటూ నగరానికి చెందిన రిత్విక్, ఆశీశ్‌లు రూపొందించిన చాక్లెట్ డిస్పెన్సర్ ప్రత్యేకంగా ఆకట్టుకుంది. రోబోటిక్స్ టెక్నాలజీతో రూపొందించిన చాక్లెట్ డిస్పెన్సర్ మిషన్‌లో కాయిన్ వెయ్యగానే చాక్లెట్ అందజేస్తుంది.

నింగిలోకి ఏకకాలంలో నాలుగు మిసైల్స్



అక్షయ్ ఆటోమేటిడ్ మిసైల్ లాంచింగ్ సిస్టమ్‌ను నగరానికి చెందిన రాకేష్ ఆవిష్కరించాడు. ఏకకాలంలో నాలుగు మిసైల్స్‌ను నింగిలోకి పంపించేందుకు ఈ టెక్నాలజీ తోడ్పడుతుంది. ఆర్మీ రంగంలో ఆటోమెటిడ్ మిసైల్ లాంచింగ్ రాబోయే రోజుల్లో ప్రత్యేక భూమిక పోషించనుందని రాకేష్ తెలిపాడు.



టెక్నోజియాన్‌ను ప్రారంభిస్తున్న మాజీ ఐఏఎస్ డాక్టర్ తనుజైన్





ఎగ్జిబిట్లు ప్రదర్శిస్తున్న విద్యార్థులు - కాజీపేట అర్బన్

రైళ్ల రాకపోకల పునరుద్ధరణ



ట్రాక్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

డోర్నకల్: డోర్నకల్ రైల్వే జంక్షన్ పరిధిలోని బైపాస్ మీదుగా శనివారం తెల్లవారుజాము నుంచి రైళ్ల రాకపోకలను పునరుద్ధరించారు. కొండపల్లి నుంచి భద్రాచలం రోడ్‌కు వెళ్తున్న గూడ్స్ రైలు మూడు బోగీలు శుక్రవారం రాత్రి బైపాస్‌లో పట్టాలు తప్పగా అధికారులు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు. రైలుకు సంబంధించిన 17, 18, 19వ బోగీలు పట్టాలు తప్పాయి. 17, 18వ బోగీలను ముందుకు, బ్యాక్ బోగీలను ఇంజన్ సాయంతో వెనకకు తరలించారు. అడ్డుగా ఉన్న బోగీని భారీ యంత్రాలతో పక్కకు తప్పించి దెబ్బతిన్న ట్రాక్‌కు మరమ్మతులు చేసి సుమారు మూడు గంటల వ్యవధిలోనే బైపాస్‌లో కొండపల్లి, భద్రాచలం రోడ్ స్టేషన్ల మధ్య రైళ్ల రాకపోకలను పునరుద్ధరించారు.

రెండు తలల మేక పిల్ల జననం



మృతి చెందిన మేకపిల్ల

నెల్లికుదురు: రెండు తలలతో మేక పిల్ల జన్మించింది. ఈ ఘటన శనివారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. నెల్లికుదురుకు చెందిన కావటి పిచ్చయ్యకు చెందిన మందలో ఒక మేక రెండు తలల పిల్లకు జన్మనిచ్చింది. పుట్టిన వెంటనే ఆ పిల్ల మృతి చెందింది. కాగా, జన్యులోపంతో అలా పుట్టిన మేకపిల్లలు జన్మించిన వెంటనే చనిపోతాయని పశువైద్యాధికారి తెలిపారు.



ఫొటోగ్రాఫర్లకు ఉపాధి గండం

స్మార్ట్‌ఫోన్ల దెబ్బకు విలవిల

- వినియోగదారుల ఆదరణ లేక అవస్థలు
- చాలా చోట్ల స్టూడియోల ఎత్తివేత
- ప్రభుత్వం పట్టించుకోవాలని వేడుకోలు

కాజీపేట : ఫొటో.. గతం తాలుకు తీపి గుర్తు. మరుపురాని, మరవలేని జ్ఞాపకం. ఎప్పటికీ చెదిరిపోని మధుర స్మృతి. అందుకే తమ జ్ఞాపకాలను భద్రపరచుకోవడానికి ప్రతి ఒక్కరూ ఫొటో తీయించుకునే వారు. దీంతో ఒకప్పుడు ఫొటో స్టూడియోలు కళకళలాడేవి. ఫొటోగ్రాఫర్లకు చేతినిండా పని లభించేది. అయితే ప్రస్తుత కాలంలో స్మార్ట్ ఫోన్ల దెబ్బతో ఫొటోగ్రాఫర్ల జీవనోపాధి దెబ్బ తింటోంది. అధునాతన టెక్నాలజీతో మార్కెట్‌లోకి వస్తున్న స్మార్ట్ ఫోన్ల వైపే ప్రజలు మొగ్గుచూపుతున్నారు. దీంతో చిన్న కార్యక్రమాలకు ఫొటోగ్రాఫర్లను పిలవడం మానేశారు. వివాహాది, శుభకార్యాలకు మాత్రమే వినియోగిస్తున్నారు. ఫలితంగా పెళ్లిళ్ల సీజన్ తప్ప మిగతా సమయంలో పెద్దగా గిరాకీ ఉండడం లేదని పలువురు ఫొటోగ్రాఫర్లు వాపోతున్నారు. క్రమేణా ఉపాధి కొరవడడంతో జిల్లాలో ఏటా ఫొటోగ్రాఫర్ల సంఖ్య తగ్గుతోంది.

ఉమ్మడి జిల్లాలో 1016కు పైగా స్టూడియోలు..

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సుమారు 1016 పైగా ఫొటో స్టూడియోలు, 7వేల మందికి పైగా ప్రత్యక్షంగా, పరోక్షంగా వృత్తిపైనే ఆధారపడి జీవించే ఫొటోగ్రాఫర్లు ఉన్నారు. ఉన్నత విద్యనభ్యసించిన వారు కూడా సరైన ఉద్యోగావకాశాలు లేక ఈ రంగంలోకి రావడంతో పోటీ పెరిగింది. ప్రస్తుతం సరైన ఉపాధి లేకపోవడంతో షాపుల అద్దెలు, కరెంట్ బిల్లులు, సిబ్బందికి జీతాలు చెల్లించలేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



అన్నింటా గడ్డుకాలం..

గతంలో ఫొటోగ్రాఫర్లు సరైన పని లేని సమయంలో కనీసం పాస్‌పోర్టు సైజు ఫొటోల ద్వారా అయినా ఉపాధి పొందే వారు. ప్రస్తుతం ఆ పరిస్థితి కూడా లేదు. ఎవరికి వారు తమ స్మార్ట్ ఫోన్‌లో ఫొటో తీసుకుని కలర్ ల్యాబ్స్‌కు వెళ్లి ప్రింట్ తీసుకుంటున్నారు. కొందరు జిరాక్స్ సెంటర్లు, మీసేవ కేంద్రాల్లో కూడా పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీస్తుండడంతో ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్లు ఉసురుమంటున్నారు. దీనికి తోడు పెరిగిన పోటీ కారణంగా క్వాలిటీ కోసం లక్షలాది రూపాయల విలువైన అధునాతన కెమెరాలను వాడాల్సిన పరిస్థితి. వినియోగదారుల ఆదరణ కొరవడడంతో పూట గడవడమే కష్టంగా ఉన్న పరిస్థితుల్లో ఇంత పెట్టుబడి ఎలా పెట్టాలో తెలియక ఫొటోగ్రాఫర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పెళ్లిళ్ల సీజన్‌లో పర్వాలేదు..

మిగతా రోజులు ఎలా ఉన్నా పెళ్లిళ్ల సీజన్ మాత్రం ఫొటోగ్రాఫర్లకు ఆశాజనకంగా ఉంటోంది. ఈ సీజన్‌లో రోజుకు రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు సంపాదిస్తారు. కానీ పెరిగిన పోటీ కారణంగా డిమాండ్ ఉన్న రోజుల్లో కూడా తక్కువ ధరలకే పని చేయాల్సి వస్తోందని మరి కొందరు చెబుతున్నారు.


అద్దె కూడా చెల్లించలేకపోతున్నాం



కొన్ని స్టూడియోల్లో ఫొటోలు తీయడం రానివారికి కూడా కెమెరాలు ఇచ్చి మార్కెట్‌లోకి పంపుతున్నారు. వాళ్లు తక్కువ ధరకే వచ్చీరాని నైపుణ్యంతో పని చేస్తున్నారు. దీంతో నైపుణ్యం ఉన్న ఫొటోగ్రాఫర్లకు పనిలేకుండా పోతుంది. గిరాకీ లేక స్టూడియోల అద్దెలు కూడా చెల్లించలేక నేడు ఎంతో మంది ఇళ్లకే పరిమితమయ్యారు.

– పిల్లి అనిల్‌కుమార్, ఫొటోగ్రాఫర్, రహమత్‌నగర్

కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



సుదీర్ఘ కాలం నుంచి ఈ వృత్తిలో ఉన్నా. ఒకప్పుడు కళకళలాడిన స్టూడియోలు నేడు ఉపాధి లేక వెలవెలబోతున్నాయి. వెనుకబడిన ఫొటోగ్రాఫర్లను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం చేయూతనందిస్తూ ప్రోత్సహించాలి. ఫొటోగ్రాఫర్ల సంక్షేమానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి.

– తూర్పాటి జగదీశ్వర్, ఫొటోగ్రాఫర్ సంఘం అధ్యక్షుడు

స్మార్ట్‌ఫోన్లతో ఉపాధి తగ్గింది



స్మార్ట్‌ఫోన్ల రాకతో సీనియర్ ఫొటోగ్రాఫర్లకు సైతం ఉపాధి కొరవడింది. ప్రస్తుతం చిన్న కార్యక్రమాలకు ఫొటోగ్రాఫర్లను పిలువడం లేదు. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. గిరాకీ లేక.. అద్దెలు చెల్లించలేక జిల్లాలో చాలా వరకు స్టూడియోలు కనుమరుగయ్యాయి.

-బొమ్మల అశోక్‌కుమార్, కాజీపేట



టెక్నాలజీని ఎవరూ ఆపలేరు



మారుతున్న టెక్నాలజీని ఎవరూ ఆపలేరు. అయితే ఫొటోగ్రాఫర్ల పనిని ఇతర వృత్తుల వారు చేస్తుడడంతో మా ఉపాధికి గండిపడుతోంది. మీసేవ కేంద్రాలు, కలర్ జిరాక్స్ సెంటర్లలో ప్రింటింగ్ బాక్స్‌ల ద్వారా పాస్‌పోర్టు సైజ్ ఫొటోలను ప్రింట్ తీసి ఇస్తున్నారు. దీంతో మాకు ఇబ్బందులు తప్పడం లేదు. దీని వల్ల నైపుణ్యం ఉన్న ఫొటోగ్రాఫర్లకు ఉపాధి లేకుండా పోతోంది.

-మంతిని మోహన్, ఫొటోగ్రాఫర్

పాపం.. పసివాడు

- తల్లి, తండ్రి మృతితో అనాథగా మారిన బాలుడు
- దాతలు, ప్రభుత్వం స్పందించి ఆశ్రయం కల్పించాలని గ్రామస్తుల వేడుకోలు



బాలుడు కొడగాని కార్తీక్



వీరేశం(ఫైల్)

దుగ్గొండి: 12 సంవత్సరాల క్రితం తల్లి, శనివారం తండ్రి మృతి చెందారు. దీంతో ఓ బాలుడు అనాథగా మారాడు. దీనిపై దాతలు, ప్రభుత్వం స్పందించి బాలుడికి ఆశ్రయం కల్పించాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని రేబల్లె గ్రామానికి చెందిన కొడగాని వీరేశం–లలిత దంపతులు వ్యవసాయ కూలీలుగా జీవనం సాగించేవారు. లలిత 12 సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటికి కార్తీక్ 3 నెలల పసికందు. దీంతో కార్తీక్‌ను నానమ్మ లచ్చమ్మ, తండ్రి వీరేశం పెంచి పోషిస్తున్నారు. ఈ క్రమంలో వీరేశం(46) శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో 12 ఏళ్ల వయసు ఉన్న కార్తీక్ అనాథగా మారాడు. తండ్రికి తలకొరివి పెట్టిన బాలుడిని చూసి గ్రామస్తులు కన్నీరుమున్నీరయ్యారు. ఊరంతా బంధువులుగా మారి అంత్యక్రియలు నిర్వహించారు. దాతలు, ప్రభుత్వం స్పందించి బాలుడికి ఆశ్రయం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ ఎన్నారై సెల్ రాష్ట్ర ప్రతినిధి శానబోయిన రాజుకుమార్ గ్రామానికి చేరుకుని కార్తీక్‌ను ఓదార్చారు. అండగా ఉండి ఆదుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మేర్గు రాంబాబు, మాజీ ఎంపీటీసీ మోహన్‌రావు, కందిపల్లి శంకర్, లింగారావు, అనిల్, నిఖిల్, ప్రసాద్, చంటి, రేబల్లె గ్రామ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

TO-LET

■ WGL, కరీమాబాద్, బొమ్మలగుడి దగ్గర మెయిన్ రోడ్ గ్రౌండ్ ఫ్లోర్ డీలక్స్ రూమ్స్ 2 BHK కిరాయికి ఇవ్వబడును. గోశాల ప్రక్కన. సంప్ర: 9848696291 [W-1264011]

PLOT FOR SALE

■ వరంగల్, ఖమ్మం జాతీయ రహదారికి ఆనుకొని మామునూర్ ఎయిర్పోర్టుకు మరియు వరంగల్ ఔటర్ రింగ్ రోడ్డుకు ఆనుకొని అతి తక్కువ ధరలో కూడా లే అవుట్ రేరా అప్రూవల్ కలిగిన ప్లాట్స్ అమ్మకానికి కలవు. 9091848484. [W-1264014]

■ హనుమకొండ కాజీపేటలో 413 చదరపు గజాల ప్లాటు అమ్మబడును. వెజిటేబుల్ మార్కెట్ దగ్గర (నో బ్రోకర్) డైరెక్ట్ పార్టీ సంప్రదించండి. సెల్: 9849129772. [W-1239932]

■ బచ్చన్నపేట దగ్గర 121 గజాలు + 4 మామిడి, 6 శ్రీ గంధం మొక్కలు, 5 లక్షలు మాత్రమే. Land కొన్నవారికి 32" SMART TV (REDMI) లేదా OPPO A3 Pro (8/256) *FREE* Ph: 6302280020 [SCA24000578]

SERVICES

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

■ మీ యొక్క సెప్టిక్ ట్యాంక్స్ నిండినవా? నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా మీ సెప్టిక్ ట్యాంక్స్ క్లీన్ చేయబడును. సంప్ర।। డి.యస్. రావు. సెల్: 9849145043 [W-1264013]

FINANCIAL SERVICES

■ సిరి అసోసియేట్స్: హౌసింగ్, మార్టిగేజ్, బిజినెస్, పర్సనల్, ఓపెన్ ప్లాటు, రేకుల ఇల్లు, గూన పెంక ఇల్లు, సిబిల్ లేకున్న రుణాలు ఇప్పించబడును. సంప్ర।। 9440863470. [W-1264010]

BUSINESS OFFER

■ ధాన్యం ధాన్యం బియ్యం బియ్యం! డైలీ అధిక మొత్తంలో కొంటాం, మాది అతిపెద్ద రైస్‌ఎక్స్‌పోర్ట్ బిజినెస్, ధాన్యం రైస్ వ్యాపారస్తులు & మక్కలు, వడ్లీలు & ఆల్ ఫుడ్ ఐటమ్స్ అమ్మేవారు, రైస్ మిల్లర్లు, మీడియేటర్స్ డైరెక్ట్ ఫోన్: 8008251356 [HA-2421]

WANTED

■ వరంగల్‌లో పనిచేయుటకు సెక్యూరిటీ సూపర్‌వైజర్స్ కావలెను. స్థలం: వరంగల్. సెల్: 9704013331 [W-1239940]

తాజా వార్తల కోసం లాగాన్ అవ్వండి www.sakshi.com

■ Wanted Sales Representative Prefered Qualification: 1. Solid Education background (Bachelor's Degree preferred), 2. Fluent in English, Telugu and Hindi, 3. Ability to travel as required, Please send your resume to mail info@primetextiles.in Or Whatsapp: 9392902241, Last date is 15.11.2024 to apply, Interview follows for impressive profiles. [WA-2332]

■ ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను పిల్లలను చూసుటకు వర్కర్స్ / నర్సులు కావాలి. ఫ్రీ వసతి, ఫుడ్ జీతం: 20K. Ph: 8977639662, 8977639663. [SCA24000542]

WANTED TEACHERS

■ Wanted Supporting Lady teacher for Primary (1 to 5) Classes. Part time and Full time. Indian Kids High School, Ramannapet, Wgl: Cell: 9963006221. [W-1264012]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వారా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

శిల్ప కళాసంపద మహాద్భుతం



ఖుష్‌మహల్‌ను తిలకిస్తున్న హైకోర్టు జడ్జి జస్టిస్ సుజయ్ పాల్



భద్రకాళి అమ్మవారి సన్నిధిలో జస్టిస్ సుజయ్ పాల్

- హైకోర్టు జడ్జి జస్టిస్ సుజయ్ పాల్

ఖిలా వరంగల్: కాకతీయుల శిల్ప కళాసంపద మహాద్భుతంగా ఉందని హైకోర్టు జడ్జి జస్టిస్ సుజయ్ పాల్ కొనియాడారు. శనివారం కాకతీయుల రాజధాని మధ్యకోటను కుటుంబ సమేతంగా సందర్శించారు. ఈ సందర్భంగా కాకతీయుల కీర్తితోరణాల మధ్య ఉన్న అద్భుత శిల్పకళాసంపదతోపాటు ఖుష్‌మహల్, రాతి, మట్టికోట అందాలు, ఏకశిల గుట్ట,శృంగారపు బావిని తిలకించారు. కాకతీయుల చరిత్ర, విశిష్టతను టూరిజం ప్రమోషన్ అధికారి సూర్యకిరణ్, పర్యాటక శాఖ గైడ్ రవియాదవ్.. జడ్జి కుటుంబ సభ్యులకు వివరించారు. కాగా, హైకోర్టు జడ్జి జస్టిస్ సుజయ్ పాల్‌ను కార్పొరేటర్లు బి. ఉమ, వి. సువర్ణ సన్మానించారు. వారి వెంట హనుమకొండ, వరంగల్ న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తీగల జీవన్‌గౌడ్, టీజీటీడీసీ కోట ఇన్‌చార్జ్ గట్టికొప్పుల అజయ్, కేంద్రపురావస్తుశాఖ కోఆర్డినేటర్ శ్రీకాంత్, మాజీ కార్పొరేటర్ బైరబోయిన దామోదర్, బోగి సురేశ్, ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం, ఎస్సై సురేశ్ పాల్గొన్నారు.

దేవాలయాలను సందర్శించిన హైకోర్టు జడ్జి

హన్మకొండ కల్చరల్ : చారిత్రక రుద్రేశ్వరస్వామి వారి వేయి స్తంభాల, భద్రకాళి దేవాలయాలను హైకోర్టు జడ్జి జస్టిస్ సుజయ్ పాల్ శనివారం సందర్శించారు. అర్చకులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతించారు. పూజలు నిర్వహించిన అనంతరం అర్చకులు.. జస్టిస్‌కు తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు, మహాదాశీర్వచనం అందజేశారు.

'సూపర్' ఆస్పత్రికి నిలిచిన నీటి సరఫరా

- తీవ్ర ఇబ్బందులు పడిన రోగులు
- నిలిచిన డయాలసిస్ సేవలు



ఎంజీఎం : కాకతీయ మెడికల్ కళాశాల ప్రాంగణంలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికీ నీటి కష్టాలు తప్పడం లేదు. మున్సిపల్ నీరు సరఫరా జరిగితే తప్ప ఆస్పత్రిలో వైద్యసేవలు అందని దుస్థితి నెలకొంది. పైపు లైన్ల మరమ్మతుల నేపథ్యంలో శనివారం నీటి సరఫరా నిలిచింది. ఫలితంగా ఆస్పత్రిలో ఎలాంటి బోర్లు లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సుమారు రూ. 150 కోట్ల వ్యయంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ఆస్పత్రిని కనీ సం బోర్లు వేయకుండా ఎలా నిర్మాణం చేపట్టారు.. ఏ విధంగా సదరు కాంట్రాక్టర్‌కు అప్పటి అధికారులు బిల్లులు చెల్లించారో తెలియని పరిస్థితి నెలకొంది. సుమారు వంద మంది రోగులు చికిత్స పొందుతున్న ఈ ఆస్పత్రిలో తాగునీరు దేవుడెరుగు.. బాత్‌రూమ్‌కు వెళ్లేందుకు సైతం నీరు లేకపోవడంతో నరకయాతన అనుభవించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

నిలిచిన డయాలసిస్ సేవలు..

కిడ్నీ బాధితులకు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలోని నెఫ్రాలజీ విభాగం ద్వారా డయాలసిస్ సేవలు అందిస్తుంటారు. ఈ సేవలు పొందాలంటే ఆస్పత్రికి కచ్చితంగా నీటి సరఫరా జరగాలి. అయితే ఆస్పత్రికి నీటి సరఫరా లేకపోవడంతో ఈ సేవలు నిలిచాయి. ఆస్పత్రిలో ప్రస్తుతం మూడు మోటార్లు ఉండగా రెండు కొన్ని నెలలుగా మరమ్మతులకు నోచుకోవడం లేదు. అంతే కాకుండా ఆస్పత్రికి ఇంటి అవసరాలకు సరిపడా ఉపయోగించే 150 ఫీట్ల బోరు మాత్రమే అందుబాటులో ఉంది. 250 పడకల ఆస్పత్రికి కనీసం రెండు, మూడు బోర్లు అందుబాటులో ఉంటే తప్ప రోగులకు భరోసా అందించలేం. అలాంటి నీటి సరఫరా విషయంలో అధికారుల నిర్లక్ష్యం వహించడంపై రోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తున్నాం..

మున్సిపల్ నీటి ద్వారా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అవసరాలు తీరుతున్నాయి. ఆస్పత్రిలో బోర్ల సౌకర్యం లేదు. ప్రస్తుతం వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసి రోగులకు సేవలు అందిస్తున్నాం. నూతన బోర్లు సైతం అందుబాటులోకి తెచ్చి రోగులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం

- మురళి, సూపరింటెండెంట్, ఎంజీఎం

మహిళ దారుణ హత్య

- గుర్రంపేటలో ఘటన

భూపాలపల్లి రూరల్: మేకల కాపరిగా పని చేస్తున్న ఓ మహిళ దారుణ హత్యకు గురైంది. ఈ ఘటన ములుగు జిల్లా వెంకటాపూర్ పోలీస్ స్టేషన్ పరిధి, భూపాలపల్లి మండలంలోని గుర్రంపేటలో జరిగింది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సకినాల సరస్వతి (35) భర్త సుమారు 7 సంవత్సరాల క్రితం మృతి చెందాడు. కూతురుకు వివాహం కాగా కుమారుడు రాకేశ్ వేరే చోట నివాసం ఉంటున్నాడు. సరస్వతి గ్రామానికి చెందిన తడుక రవి వద్ద మేకలు కాపరిగా పనిచేస్తూ వారి మేకల పాకలోనే ఒంటరిగా జీవనం కొనసాగిస్తోంది. ఈ క్రమంలో శనివారం ఉదయం మేకల పాక శుభ్రం చేసేందుకు వెళ్లిన ఇతర కాపరులకు సరస్వతి దారుణ హత్యకు గురై కనిపించింది. గొంతకోసి ఉండి గుర్తై రక్తపు మడుగులో నిర్జీవంగా ఉండడం గమనించిన వారు.. ఈ విషయాన్ని వెంటనే గ్రామపెద్దలతోపాటు పోలీసులకు తెలిపారు. దీంతో ములుగు సీఐ శంకర్, ఎస్సై సతీశ్ ఘటనా స్థలిని పరిశీలించారు. హత్యకు గల కారణాలు, నిందితుల గుర్తింపు కోసం డాగ్ స్క్వాడ్, ఫింగర్ ప్రింట్ బృందాలతో ఆధారాలు సేకరించారు. ఒంటరి మహిళ దారుణ హత్యకు గురికావడంతో గ్రామం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఈ ఘటనపై మృతురాలి సోదరుడు మధు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ శంకర్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించామని సీఐ పేర్కొన్నారు.

చుక్కా సత్తయ్య తెలంగాణకే తలమానికం

- విగ్రహావిష్కరణలో పలువురు వక్తలు




సత్తయ్య విగ్రహావిష్కరణలో పలువురు ముఖ్యులు

లింగాలఘణపురం: ఒగ్గు కథ పితామహుడు, కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత చుక్కా సత్తయ్య తెలంగాణ రాష్ట్రానికే తలమానికమని తెలంగాణ క్రాంతిదళ్ వ్యవస్థాపక అధ్యక్షుడు పృథ్వీ అన్నారు. శనివారం చుక్క సత్తయ్య స్వగ్రామం మాణిక్యాపురంలో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కలిసి ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ఆల్ ఇండియా యాదవ మహాసభ మహిళా విభాగం అధ్యక్షురాలు, చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, దుబాయ్ ఇంటర్నేషనల్ నెక్ట్‌లెవల్ గోల్డెన్ ఈవెంట్ చైర్‌పర్సన్ ఉపాసనతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉస్తాద్ ఒగ్గు రవి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో పృథ్వీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ దేశ ప్రధానమంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రుల చేతుల మీదుగా ఎన్నో అవార్డులు అందుకున్న చుక్కా సత్తయ్య విగ్రహం ఏర్పాటు చేసుకోవడానికి ఏడేళ్లు పట్టిందని, అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఈ కార్యక్రమానికి రాకపోవడం బాధాకరమన్నారు. చుక్కా సత్తయ్య బహుజన వర్గానికి చెందిన వాడు కావడమే ఇందుకు కారణమని, బహుజనులంతా ఏకమై రాజ్యాధికారం దిశగా పయనించాలన్నారు. బొంతు శ్రీదేవి మాట్లాడుతూ చుక్కా సత్తయ్య చనిపోయే ఇరవై రోజుల ముందు తన ఇంటికి వచ్చి మాట్లాడి తనను ఆశీర్వదించారని గుర్తు చేశారు. ఉపాసన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత కళలను దేశ, విదేశాల్లో ప్రదర్శించేందుకు కృషి చేస్తున్నామని, ఒగ్గుడోలు కథను దుబాయ్‌లో ప్రదర్శించామన్నారు. వరంగల్ కళా క్షేత్రానికి చుక్కా సత్తయ్య పేరు పెట్టాలని, ట్యాంక్‌బండ్‌పై విగ్రహం ఏర్పాటు చేసి జనగామ జిల్లాకు ఆయన పేరు పెట్టాలని పలువురు వ్యక్తులు డిమాండ్ చేశారు. సమావేశంలో చుక్కా సత్తయ్య కుమారులు ఆంజనేయులు, శ్రీశైలం, నాయకులు సేవెల్లి సంపత్, శేఖర్, ముక్దాం, ఆయా జిల్లాల కురుమ సంఘం అధ్యక్షులు పాల్గొనగా ఒగ్గు డోలు కళాకారులు, బుడిగ జంగాల కళాకారులు పాల్గొని అతిథులకు ఘన స్వాగతం పలికారు.

అతడు.. ఆమెగా

ఓ మహిళ ఫొటోతో వివాహ వెబ్‌సైట్‌లో ప్రొఫైల్

- లైక్ కొట్టిన వృద్ధుడితో ఫోన్‌లో యువతిగా గొంతుమార్చి పరిచయం
- చివరికి పెళ్లికి సై అన్న ఆటోడ్రైవర్
- వరంగల్‌కు పిలిపించి మరో ఇద్దరికి కలిసి చితకబాదిన వైనం
- బాధితుడి ఫిర్యాదు మేరకు ముగ్గురి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

హసన్‌పర్తి: కుటుంబ పోషణ భారంగా మారడంతో ఆ ఆటోడ్రైవర్ సులువుగా డబ్బులు సంపాదించాలన్న ఆశతో ఓ వివాహ వెబ్‌సైట్‌లో మహిళ ఫొటోతో ప్రొఫైల్ క్రియేట్‌చేశాడు. అదే మహిళ పేర సిమ్ కార్డులు తీసుకున్నాడు. ఆ ప్రొఫైల్‌ను లైక్ కొట్టిన ఓ వృద్ధుడితో ఫోన్‌లో ఆడగొంతుతో మాట్లాడి పరిచయం పెంచుకున్నాడు. చివరికి పెళ్లి దాకా తీసుకువచ్చాడు. వరంగల్‌కు రమ్మని చెప్పి మరో ఇద్దరితో కలిసి ఆ వృద్ధుడిని చితకబాది నగదు తీసుకున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆ ముగ్గురిని అరెస్ట్ చేసిన పోలీసులు మహిళ కోసం గాలిస్తున్నారు. కేయూ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. హనుమకొండ రాంనగర్‌కు చెందిన గోదారి శేఖర్ ఆటోడ్రైవర్. ఆటోతో కుటుంబం గడవడం కష్టంగా మారింది. దీంతో సులువుగా డబ్బులు సంపాదించాలన్న ఆశతో పబ్లిక్‌గార్డెన్ సమీపంలో పరకాలకు చెందిన లక్ష్మి అనే మహిళతో పరిచయం పెంచుకున్నాడు. ఆమె పేరు, ఫొటోతో రెండు కంపెనీలకు చెందిన సిమ్‌కార్డులు తీసుకున్నాడు. జోడీ.కామ్ (jodi. com) వెబ్‌సైట్‌లో లక్ష్మీ పేర ఓ ప్రొఫైల్ క్రియేట్ చేసి ఫొటో అప్‌లోడ్ చేశాడు. ఈ ప్రొఫైల్‌కు యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామానికి చెందిన దేవులపల్లి శ్రీనివాస్ అనే వృద్ధుడు లైక్ కొట్టి వివరాలు నమోదు చేశాడు. ఈ క్రమంలో శ్రీనివాస్‌తో శేఖర్ తన పేరును లక్ష్మిగా పరిచయం చేసుకుంటూ ఆడ గొంతుతో మాట్లాడడం ప్రారంభించాడు.

వాట్సాప్‌లో చాటింగ్..

ఆ పరిచయం వాట్సాప్ చాటింగ్ వరకు వెళ్లింది. తనకు భార్య లేనందున పెళ్లి చేసుకుంటానని దేవులపల్లి శ్రీనివాస్.. శేఖర్ (లక్ష్మి)కు చెప్పగా అంగీకరించాడు. గత నెల 25న హనుమకొండ బస్టాండ్‌కు వస్తే, తన వారు వస్తారని శ్రీనివాస్‌కు.. శేఖర్(లక్ష్మి) ఫోన్ చేసి చెప్పాడు. ఆ రోజు శ్రీనివాస్ హనుమకొండ బస్టాండ్‌కు రాగా, గోపాలపురానికి చెందిన దుర్గం రాజయ్య, లక్ష్మయ్య అనే ఇద్దరిని శేఖర్ బస్టాండ్‌కు పంపించాడు. వారు శ్రీనివాస్‌ను ఆటోలో ఎక్కించుకుని కోమటిపల్లి రైల్వేట్రాక్ వద్దకు తీసుకెళ్లారు. అప్పటికే అక్కడికి చేరుకున్న శేఖర్ వారిద్దరితో కలిసి శ్రీనివాస్‌ను చితకబాదారు. రూ.24వేలు ఫోన్ పే చేయించుకున్నారు.

బాధితుడి ఫిర్యాదు,.. కేసు నమోదు..

బాధితుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీస్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ దర్యాప్తు వేగవంతంగా చేశారు. గోపాలపురం శివారులో నిందితుడు శేఖర్‌తోపాటు దుర్గం రాజయ్య, లక్ష్మయ్యలను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించినట్లు ఏసీపీ తెలిపారు. ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఏసీపీ చెప్పారు. మరో నిందితురాలు లక్ష్మి పరారీలో ఉన్నట్లు తెలిపారు. నిందితులనుంచి రూ.24వేల నగదు, మూడు సెల్‌ఫోన్లు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. కేయూ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఎస్సైలు రవీందర్, ప్రవీణ్ పాల్గొన్నారు. కేసును ఛేదించిన ఇన్‌స్పెక్టర్ రవికుమార్‌ను ఏసీపీ అభినందించారు.